క్లుప్తంగా

సూచిక బోర్డులు ఏర్పాటు



సూచికబోర్డు ఏర్పాటు చేస్తున్న గ్రామస్తులు

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్ నుంచి పలుగ్రామాలకు వెళ్లే దారుల వద్ద ఆదివారం సూచికబోర్డులను ఏర్పాటు చేశారు. పోతుగల్ నుంచి సిరిసిల్ల, గండిలచ్చపేట, సేవాలాల్‌తండా, ఆవునూర్ వెళ్లే మార్గాలను చూపుతూ బోర్డులను ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిగారి శ్రీనివాస్ పేర్కొన్నారు. అలాగే నల్లపోచమ్మ ఆలయానికి వెళ్లే దారిలోనూ బోర్డును ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సీఐకి సన్మానం



సీఐ మొగిలిని సన్మానిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: సిరిసిల్ల రూరల్ సీఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన మొగిలిని కాంగ్రెస్ మండల నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. సీఐని శాలువాతో సత్కరించారు. గతంలో ఆయన ఎల్లారెడ్డిపేట సీఐగా నాలుగేళ్లు పనిచేశారు. సీఐని కలిసిన వారిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, నాయకులు ఎస్కే గౌస్, బండారి బాల్‌రెడ్డి, గుండాడి రాంరెడ్డి తదితరులున్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



వీర్నపల్లి: మండలకేంద్రంలోని ఎస్సార్ పెట్రోల్ బంక్ నుంచి ఫారెస్ట్ గెస్ట్ హౌజ్ వరకు దాదాపు 2 కిలోమీటర్ల మేర చేపట్టనున్న సీసీరోడ్డు పనులను ఆర్‌అండ్‌బీ అధికారులు ఆదివారం ప్రారంభించారు. ఈ రోడ్డు గుంతలమయంతో అధ్వానంగా మారడంతో వాహనదారులు ఇబ్బంది పడేవారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు పలుసార్లు విన్నవించడంతో పనులు ప్రారంభించారు. ఈ రోడ్డు పనులు ఇబ్బందులు తీరుతాయని వాహనదారులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. మండల సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, మాజీ సర్పంచ్ పాటి దినాకర్, నాయకులు గుగులోత్ సురేశ్, గడ్డం దేవయ్య, లక్ష్మీరాజం, తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

కోనరావుపేట: ఉద్యోగాలకు పోటీపడే యువతీ యువకులు ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిల్ ఫర్ సిటీజన్ రైట్స్ సంస్థ జోనల్ కార్యదర్శి రత్నాకర్ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ... హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఈ శిక్షణ తరగతులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులు శిక్షణ ఇస్తారని ఆయన పేర్కొన్నారు.

బియ్యం వితరణ

తంగళ్లపల్లి: మండలకేంద్రంలోని ఇందిరానగర్‌కు చెందిన బొలబత్తిని రాజేశం ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఆదివారం కాంగ్రెస్ నాయకులు మాజీ ఉప సర్పంచ్ పెద్దూరి తిరుపతి పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబానికి క్వింటాల్ బియ్యం వితరణగా అందజేశారు. ఇక్కడ కాంగ్రెస్ నాయకులు నేరెళ్ల నర్సింగం గౌడ్, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు ఆనందం, పరుశురాం, చుక్క శేఖర్, కరుణాకర్ తదితరులున్నారు.

నియామకం



రాజేశం

బోయినపల్లి: మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన ఇల్లెందుల రాజేశంను తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు కత్తెర దేవదాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తన నియామకానికి సహరించిన దేవదాస్‌కు రాజేశం కృతజ్ఞతలు తెలిపాడు.

టార్పాలిన్ కవర్లు అందజేత

కోనరావుపేట: మండలంలోని మరిమడ్లలో పెంకుటిళ్లు ఉన్న యజమానులకు లైవ్ జిల్లా అధ్యక్షుడు బానోత్ నరేశ్ ఆదివారం టార్పాలిన్ కవర్లు అందించారు. గ్రామంలోని నిరుపేదలకు పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామంలోని ఆరుగురికి అందించామన్నారు. కార్యక్రమంలో శ్రీనాథ్ నాయక్, దిలీప్‌కుమార్, రాజు, రమేశ్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చందుర్తి: మండలంలోని జోగాపూర్ శివారు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌తోపాటు జేసీబీని పోలీసులు శనివారం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఒర్రె ప్రాంతంలో జేసీబీతో ట్రాక్టర్‌లో లోడ్ చేస్తుండగా పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని ఎస్సై పేర్కొన్నారు.

అసంపూర్తిగా నిర్మాణం

- మార్కెట్ యార్డులో నూతన భవన నిర్మాణానికి ఏడాదిన్నర క్రితం పనులు ప్రారంభం
- నగం పనులు చేసి వదిలేసిన కాంట్రాక్టర్
- త్వరగా నిర్మించాలని డిమాండ్



రుద్రంగి మార్కెట్‌లో అసంపూర్తిగా వదిలేసిన నూతన కార్యాలయ భవనం

రుద్రంగి: మండలకేంద్రంలోని మార్కెట్‌యార్డులో సిబ్బంది, రైతుల సౌలభ్యం కోసం నూతన కార్యాలయ భవన నిర్మాణానికి ఏడాదిన్నర క్రితం మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు, అధికారులు పనులు ప్రారంభించారు. రూ.40.46 లక్షలతో భవనాన్ని నిర్మించేందుకు పనులు ప్రారంభించగా కాంట్రాక్టర్ నగం పనులు చేసి వదిలేశాడు. భవన నిర్మాణం కోసం తెచ్చిన ఇసుక, మెటీరియల్ అక్కడే ఉంచడంతో గత మూడు, నాలుగు సీజన్ల నుంచి ధాన్యం ఆరబోసుకునేందుకు స్థలం కొరతతో రైతులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. భవన నిర్మాణం పూర్తయితే మార్కెట్ సిబ్బందితో పాటు రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని, పనులు వెంటనే పూర్తిచేయాలని వారు కోరుతున్నారు.

మార్కెట్‌లో వసతుల లేమి..

రుద్రంగి మార్కెట్ యార్డులో 25 శాతం సీసీ ఉండగా మిగతా 75 శాతం మట్టి నేలనే ఉంది. పిచ్చి మొక్కలు మొలిచి అధ్వానంగా తయారైందని రైతులు వాపోతున్నారు. యార్డులో ఇదివరకే కార్యాలయం ఉండగా మళ్లీ నూతన కార్యాలయం నిర్మించే బదులు మార్కెట్ యార్డులో వసతులు కల్పిస్తే బాగుండేదని నిర్మాణ పనులు ప్రారంభించినప్పుడే రైతుల నుంచి విమర్శలు వచ్చాయి. ఇప్పటికైనా వసతుల కల్పనపై దృష్టిసారించాలని, యార్డులో ధాన్యం ఆరబెట్టుకునేందు సీసీ ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

వసతులు కల్పించాలి



మార్కెట్‌యార్డులో వసతులు లేవు. రైతులు ధాన్యం ఆరబెట్టుకునే స్థలంలో ఉన్న ఇసుకను, ప్రైవేట్ వ్యక్తులు నిలువ ఉంచిన ధాన్యం బస్తాలు తొలగించాలి. కార్యాలయ నిర్మాణం పూర్తిచేస్తే ఇసుక, మెటీరియల్ ఖాళీ అవుతుంది. దీంతో పంటకోసిన తర్వాత రైతులు ధాన్యం ఆరబెట్టుకునేందుకు వీలవుతుంది.

– దేవేని శ్రీనివాస్, రైతు, రుద్రంగి

కాంట్రాక్టర్‌కు సూచించాం



మండలకేంద్రంలో రైతులు, సిబ్బంది సౌలభ్యం కోసం మార్కెట్ యార్డులో ఏడాదిన్నర క్రితం భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. నూతనంగా నిర్మిస్తున్న కార్యాలయ నిర్మాణ పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు ఇదివరకే సూచించాం. త్వరలోనే నిర్మాణ పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటాం.

– సత్యనారాయణ మార్కెట్ కమిటీ ఇన్‌చార్జి, రుద్రంగి



వేములవాడ అర్బన్: సమావేశమైన 1984-85 బ్యాచ్ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1984–1985 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమేళనం ఆదివారం అగ్రహారంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. 39 ఏళ్ల తర్వాత ఒకేచోట కలుసుకోవడవంతో అప్పటి జ్ఞాపకాలను నెమరుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అబ్దుల్ మన్నాన్, దేవరాజు, శంకర్, రామ్‌రెడ్డి, రాము, రాజశేఖర్, శ్రీనివాస్, శ్రీధర్, రమణ, దేవిప్రసాద్, కృష్ణారావు, రవి, రాజు, శ్రీనివాస్, దేవేందర్, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: వారంతా ముప్పై ఏళ్ల క్రితం ఉన్నత చదువుల కోసం విడిపోయారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ హైస్కూల్‌లో 1993- 94 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు అదే స్కూల్‌లో ఆదివారం రోజు కలుసుకున్నారు. తమ గురువులు ఆనందాచారి, జి.నాగేంద్రం, మధుసూదన్, నర్సింగారావులను ఘనంగా సన్మానించారు.



ఎల్లారెడ్డిపేట: 1993-94 బ్యాచ్ విద్యార్థులు

ఆర్థికసాయం అందజేత



బోయినపల్లి: మండలంలోని విలాసాగర్ పాఠశాలలో 2003–04లో పదో తరగతి చదివిన రేగుల బాలరాజు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. అదే సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం బాలరాజు కుటుంబానికి రూ. 52,200లను ఆర్థికసాయంగా అందించారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

నియామకం



హరేందర్ రెడ్డి

సిరిసిల్ల ఎడ్యుకేషన్: ఇల్లంతకుంట మండలంలోని ఎంపీపీఎస్ అనంతారంలో పనిచేస్తున్న కోమటిరెడ్డి హరేందర్‌రెడ్డిని పీఆర్టీయూ తెలంగాణ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పాతూరి రాజి రెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షుడు రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, అధ్యక్షుడు ఉమకర్ రెడ్డి ఉత్తర్వులు ఆదివారం జారీచేశారు. ఈ సందర్భంగా హరేందర్‌రెడ్డి మాట్లాడుతూ... ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హరేందర్‌రెడ్డి తెలిపారు.

మొక్కులు చెల్లింపు



సిరిసిల్లటౌన్: సిరిసిల్ల పట్టణంలోని 36 వ వార్డు వెంకంపేట్ ఆటో యూనియన్ సంఘ సభ్యులు, గౌరవాధ్యక్షుడు కల్లూరి రాజు ఆధ్వర్యంలో సుందరయ్యనగర్ లోని మైసమ్మ, వెంకంపేట్‌లోని పోచమ్మ తల్లికి ఆషాఢ మాసం సందర్భంగా ఆదివారం మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గౌరవ సలహాదారు అంబాల మల్లేశం, అధ్యక్షుడు బొల్లి అంబదాస్, ఉపాధ్యక్షుడు శేఖర్, మనోహర్, రాజు, శ్రీనివాస్, నజీర్ తదితరులు ఉన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ మొగిలి

ముస్తాబాద్: రోడ్డుప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి అన్నారు. ముస్తాబాద్, తెర్లుమద్దిలో ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలిస్తే జరిమానాలు విధిస్తామన్నారు. రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ఇక్కడ ఎస్సై శేఖర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ఆలయాల్లో చోరీ

వేములవాడఅర్బన్: వేములవాడ రూరల్ మండలంలోని చెక్కపల్లి పెద్దమ్మ ఆలయం, నమిలిగుండుపల్లిలోని మడేలయ్య ఆలయంలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఆలయాల్లోని పుస్తెమట్టెలు దొంగలు ఎత్తుకెళ్లారు. ఘటన స్థలాన్ని పరిశీలించి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వేములవాడ రూరల్ ఎస్సై మారుతి తెలిపారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

కోనరావుపేట: ఉద్యోగాలకు పోటీపడే యువతీ, యువకులు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సంస్థ జోనల్ సెక్రెటరీ నెవూరి రత్నాకర్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి వై జంక్షన్ మెట్రోస్టేషన్ పక్కన (సీటీఈ) సెంటర్ ఫర్ ట్రైనింగ్ అండ్ ఎంప్లాయ్‌మెంట్, సీసీఆర్ కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సంస్థ ప్రారంభించినట్లు తెలిపారు. విద్యార్థుల అర్హతను బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. అవకాశాన్ని ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు మంచికట్ల అనిల్‌కుమార్, సెంటర్ ఫర్ ట్రైనింగ్ అండ్ ఎంప్లాయ్‌మెంట్ ట్రైనర్స్ కరీముద్దీన్, అశోక్ కుమార్ కాకర్ల, సెంట్రల్ కమిటీ సెక్రెటరీ గుండ్ల శివచంద్రం, తదితరులు శిక్షణనివ్వనున్నట్లు పేర్కొన్నారు.

శిథిలావస్థలో ఎమ్మార్సీ భవనం



మండలకేంద్రంలోని ఎమ్మార్సీ భవనం

కోనరావుపేట: మండలకేంద్రంలోని మండల వనరులకేంద్ర భవనం శిథిలావస్థకు చేరుకుంది. కొన్నేళ్ల క్రితం నిర్మించిన భవనం ఉరుస్తుండటంతో ఉద్యోగులు భయాందోళన మధ్య విధులు నిర్వర్తిస్తున్నారు. మండలకేంద్రంలోని ఎమ్మార్సీలో ఎంఈవోతో పాటు పలు పాఠశాలలకు చెందిన సీఆర్పీలు, కంప్యూటర్ ఆపరేటర్ పనిచేస్తుంటారు. వర్షాకాలంలో కార్యాలయంలోని గదులన్నీ ఉరుస్తూ గోడలన్నీ పాకురుగా తయారవుతున్నాయి. కార్యాలయంలోని దర్వాజాలు, తలుపులు, కిటికీలు చెదలుపట్టి ముట్టుకుంటే ఊడిపోయే స్థితికి చేరుకున్నాయి. మండలంలోని అన్ని పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలను ఈ కార్యాలయం నుంచే సరఫరా చేస్తారు. ఎప్పుడు కూలుతుందో తెలియని ఈ కార్యాలయంలో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ఎమ్మార్సీకి కొత్త భవనాన్ని మంజూరు చేయాలని కోరుతున్నారు.



పగుళ్లుబారిన గోడలు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలను కాపాడుకోవాలి



మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్ పాసైన విద్యార్థులు ప్రవేశాలు పొంది కళాశాలను కాపాడుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేని రంజిత్‌కుమార్ అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం మాట్లాడారు. లక్ష్యం మేరకు విద్యార్థులు కళాశాలలో చేరకుంటే కళాశాల తరలిపోయే ప్రమాదముందన్నారు. కళాశాలలో చేరుతున్న పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు తరగతుల నిర్వహణకు తరగతి గదులు, ల్యాబ్‌లు, బోధన సిబ్బందికి సరిపోడా తాత్కలిక భవనాన్ని ఏర్పాటు చేయాలన్నారు. కళాశాల నిర్వహణకు, ప్రయోగశాల సామగ్రికి, ఫర్నిచర్ కోసం నిధులు మంజూరు చేయాలన్నారు. నాయకులుపెండ్యాల శివ, కొప్పుల నవీన్, మందాటి శివప్రసాద్, మిర్యాల్‌కర్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

గోవిందరాజుల ఆలయంలో పూజలు



చందుర్తి: ఆది శ్రీనివాస్ దంపతులకు ఆశీర్వచనం చేస్తున్న అర్చకుడు



వేములవాడ: పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, ట్రస్ట్ ప్రతినిధులు

చందుర్తి: మండలంలోని సనుగుల గ్రామంలో శ్రీ గోవిందరాజుల స్వామి సన్నిధిలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కుటుంబ సభ్యులు ఆది వారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారికి ఘన స్వాగతం పలికారు. స్వామి సన్నిధిలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రభుత్వ విప్ దంపతులు ఆది వనజ శ్రీనివాస్, కుమారుడు కార్తీక్, సోదరుడు రవి, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

వేములవాడ: బాబా దీవెనలతో ప్రజలంతా సంతోషంగా ఉండాలని ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఈనెల 21న జరిగే గురుపూర్ణిమ సందర్భంగా ఆదివారం సాయిబాబా ట్రస్ట్ ప్రతినిధులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ...ఉత్సవాల్లో ప్రజలంతా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో షిరిడీ సాయిబాబా సేవా సంస్థాన్ ట్రస్ట్ అధ్యక్షుడు వారాల దేవయ్య, మున్సిపల్ వైస్‌చైర్మన్ బింగి మహేశ్, ట్రస్ట్ ఉపాధ్యక్షుడు కోనమ్మగారి నాగరాజు, కార్యదర్శి గంప రాజేందర్, కోశాధికారులు కూర రమేశ్, బండారి కుమార్, సంస్థ సభ్యులు ఏంబేరి నర్సయ్య, తొగరి వెంకటేశం, తడగొండ కృష్ణస్వామి, రైకనపాట శ్రీనివాస్, నాగుల యాదగిరి, పీచర రవీందర్‌రావు పాల్గొన్నారు.

చౌకధరల దుకాణాల్లో చక్కెర అందించాలి



చౌకధరల దుకాణాన్ని పరిశీలిస్తున్న బియ్యంకార్ శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: జిల్లాలోని చౌకధరల దుకాణంలో రేషన్‌కార్డు ఉన్నవారందరికీ చక్కెర అందించాలని జిల్లా పౌర సంక్షేమ సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఓ చౌకధరల దుకాణంలో సరఫరా చేస్తున్న వస్తువులను పరిశీలించారు. చక్కెర రాలేదని డీలర్ తెలపడంతో సంబంధిత అధికారులను వివరణ కోరగా జిల్లాలో టెండర్స్ కాలేదని దాటవేసినట్లు తెలిపారు. కలెక్టర్ చొరవ తీసుకుని పేదలకు అవసరమైన కిరోసిన్, గోధుమలు, చక్కెల చౌకధరల దుకాణాల్లో వచ్చేలా చూడాలన్నారు. మున్సిపల్ పరిధిలోని కొన్ని కాలనీల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, దీనిపై మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న చక్రధర్‌రెడ్డి

ముస్తాబాద్: రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కనమేని చక్రధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని తెర్లుమద్దిలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇతర రాష్ట్రాల సీఎంలతో సఖ్యతగా ఉండి సమస్యలు పరిష్కరించుకుంటే దానిని తప్పుపట్టడం బీఆర్‌ఎస్ నాయకులకే చెల్లిందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలలో విజయం సాధిస్తుందన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. త్వరలోనే రైతులకు రైతు భరోసా అందుతుందన్నారు. కాంగ్రెస్‌పై దుష్ప్రచారాన్ని బీఆర్‌ఎస్ నాయకులు మానుకోవాలన్నారు. సమావేశంలో సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు కలకొండ కిషన్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ అంజన్‌రావు, కాంగ్రెస్ ఎన్‌ఆర్‌ఐ సెల్ జిల్లా అధ్యక్షుడు ధర్మేందర్, వేణు, దేవేందర్, శ్రీకాంత్, శ్రీనివాస్, చందు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



తంగళ్లపల్లి: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మిడ్‌డే మీల్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్ అన్నారు. ఆదివారం ఇల్లంతకుంట మండలకేంద్రంలోని ఎంఈవో కార్యాలయం ఎదుట మిడ్‌డే మీల్స్ వర్కర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వమే కోడి గుడ్లు అందించాలని, మధ్యాహ్న భోజన కార్మికులకు డ్రెస్ కోడ్ అమలు చేయాలని, నెలకు రూ.10 వేలు జీతం ఇవ్వాలన్నారు. గ్యాస్ సిలిండర్లు నిత్యావసరాలు పంపిణీ చేయాలని, పెండింగ్ బిల్లులు చెల్లింపులతోపాటు సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు జి.రాజవ్వ, జుబేదా, దేవక్క, ఐలవ్వ, సుశీల, లావణ్య, లత, కనకవ్వ, లక్ష్మీ, బాలలక్ష్మి, దేవలక్ష్మీ, ప్రమోద తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు



గంభీరావుపేట: ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

గంభీరావుపేట: మండలంలోని శ్రీగాధలో మాదిగ దండోర రిజర్వేషన్ సమితి ఆవిర్భావ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కానాపురం లక్ష్మణ్, గ్రామ శాఖ నాయకులు జాషువా, బాబు, స్టీఫెన్, సుదర్శన్, ప్రవీణ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను మండలకేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కానాపురం లక్ష్మణ్, జిల్లా నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా అంగన్‌వాడీ కేంద్రం



చిప్పలపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రం

ముస్తాబాద్: మండలంలోని చిప్పలపల్లిలో అంగన్‌వాడీ కేంద్రం స్టోర్ రూమ్‌గా మారింది. ఇక్కడి అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రాథమికోన్నత పాఠశాలకు తరలించడంతో అప్పటినుంచి అంగన్‌వాడీ కేంద్రం నిరుపయోగంగా ఉంది. గ్రామ పంచాయతీ ఆవరణలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ భవనాన్ని పంచాయతీ అధికారులు, సిబ్బంది ఇలా స్టోర్ రూంగా వాడుతున్నారు. గ్రంథాలయం, లేదా మహిళా సంఘానికి అంగన్‌వాడీ భవనాన్ని కేటాయిస్తే బాగుంటుందని గ్రామస్తులు భావిస్తున్నారు. రూ.లక్షలాది రూపాయలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనం నిరుపయోగంగా ఉందని, రెండో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు కోసం చేసిన ప్రతిపాదనలకైనా దీనిని వినియోగించాలని కోరుతున్నారు.

'నీట్'పై కేంద్రమంత్రి స్పందించాలి

వీర్నపల్లి: నీట్ పరీక్షా పత్రం లీకేజీపై కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జాలపెల్లి మనోజ్ కుమార్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.